వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 51 ఏప్రిల్ 2018 సంచిక : 04

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 51 ఏప్రిల్ 2018 సంచిక : 04

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ఆరాధనాంజలి - శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వాములవారు - 06
03. అపక్వాహారం - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 07
04. సద్గురు బోధ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 10
05. శరణాగతి - శ్రీరామకృష్ణ పరమహంస - 13
06. భాగవత సుధ - శ్రీరామకృష్ణానందగిరిస్వాములవారు - 15
07. ఆచార్యోపాసనమ్ - శ్రీశివదేవానందస్వాములవారు - 19
08. మాతృ ప్రేమ - ఆచార్య కె.సర్వోత్తమరావు - 25
09. గంగాయాం గీత - శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు - 28
10. కారణ జన్ములు శ్రీ విద్యాప్రకాశానందస్వామీజీ- డా॥సముద్రాల లక్ష్మణయ్య -31
11. అమృతానుభవము - నైనారు అప్పాస్వామి - 35
12. భాగవత కథలు - శ్రీరామచంద్రడొంగరేమహారాజ్ - 36
13. భగవంతునికి ఇష్టమైనవారు గురుదేవులు - ఈశ్వర్ - 40
14. వార్తలు - 42

ముఖచిత్రం :

పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు

3-4-2018 చైత్ర బహుళ తదియ శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి జన్మదినము

14-4-2018 తమిళ సంవత్సరాది : 18-4-2018 బసవేశ్వర జయన్తి

20-4-2018 జగద్గురు శంకరాచార్య జయన్తి

29-4-2018 వైశాఖ పూర్ణిమ, 29-4-2018 గౌతమ బుద్ధ జయన్తి.

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

01. ఓమ్ అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ ।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః ॥

02. ఓమ్ వికిరన్తం సదా గీతామకరందం మహీతలే ।
యతిశ్రేష్ఠం భజే విద్యా ప్రకాశానంద సద్గురుమ్ ॥

03. ఓమ్ జయతు జయతు శాన్తం శాశ్వతం బ్రహ్మతేజః
జయతు జయతు వేదాన్తామృతోదార భూజః ।
జయతు జయతు గీతా భోదకాచార్యరాజః
జయతు జయతు విద్యాజ్యోతి రానందతేజః ॥

04. వందనము లివె ప్రకాశానందగిరి యతీంద్ర !
కృప ననారతమును బ్రోవం దగు
సమస్త మానవ బృందంబుల
దైవభక్తి పెంపొందంగన్ ॥

05. అట్టడుగులోని మనుజునకైన ఇట్టె
యర్థమగు నట్లు గీతార్థ మందజేసి
దివ్యసందేశ దీప్తి వాతేనె లొసగి
పూజలందిన స్వామి ! నమోఽస్తు మీకు.

06. తేనెల్ చిందెడు నే యతీంద్రు భగవద్గీతా ప్రసంగంబులన్
నానా పండిత పామరౌఘము మహానందంబుతో వించు వి
జ్ఞానంబున్ గడియించు, న వ్వరమ పుణ్యశ్లోకు విద్యా ప్రకాశా
నందాఖ్యు శుకాశ్రమాధిపతి నే నశ్రాంతమున్ గొల్చెదన్.

పుష్పాంజలి

- శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపకులు, ఆంధ్రదేశమందేగాక విదేశాలలోను అనన్య ప్రచారం పొందిన గీతామకరంద రచయితలు అయిన గురుదేవులు పరమ పూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామివారి 105వ జన్మదినోత్సవం,20వ ఆరాధనోత్సవం ఇపుడు మనం జరుపుకుంటున్నాము.

శ్రీవారు తమ గీతాజ్ఞానయజ్ఞాలలో దిగంతాలు ప్రతిధ్వనించే భగవద్గీతోపన్యాసాల సరసోక్తులు, హితోక్తులు, వ్యంగ్యోక్తులతో ఆంధ్రావనిని పునీతం చేశారు. శ్రీవారి గీతామకరందం సామాన్య మానవునికి కూడ అర్థమయి గీతయందు అభిరుచిని, ఆసక్తిని పెంపొందించింది. వారి సదాచార సచ్ఛీలతతో గూడిన అనుష్ఠానం ఎందరెందరికో మార్గ దర్శకమైంది. శ్రీ స్వాములవారి ప్రవచనాలు నిత్యనూతనోత్సాహంతో మానవాళికి శ్రేయోమార్గదీపికయై, ఆధ్యాత్మికంగా, సామాజికంగా నిద్రాణమైన సమాజాన్ని జాగృతం చేశాయి.

డా॥ రావులసూర్యనారాయణ మూర్తిగారన్నట్లు గీతోపన్యాస సందర్భంలో శ్రీస్వాములవారి విరాడ్రూపాన్ని చూస్తే అర్జునుడు విశ్వరూపం దర్శించి సమ్మోహితుడైనట్లు మనమూ సమ్మోహితుల మౌతాము. శ్రీ స్వాములవారు ఏ మారుమూల ప్రాంతంలో గీతా ప్రవచనం చేసినా అసంఖ్యాక జనసందోహం సంతోష సంరంభాలతో పాల్గొనడం మనందరికి విదితమే. డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారన్నట్లు - శ్రీ స్వాములవారి గీతామకరందం అనితర సాధారణ వ్యాప్తిని పొందింది. వారి మహోపన్యాసాలు లక్షలకొలది ప్రజలలో చైతన్యాన్ని రేకెత్తించాయి. నిరర్గళ వాగ్వైభవం వారికి భగవంతుడిచ్చిన వరం.

ఇట్టి పూజ్య గురుదేవుల 20వ ఆరాధనోత్సవాలలో వారికిదే నా పుష్పాంజలి.

అపక్వాహారం

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మనం భుజించే ఆహారంలోని సూక్ష్మాంశమే మనస్సుగా మారుతుంది. ఆహారం పవిత్రమైతే మనస్సు కూడా పవిత్రంగా వుంటుంది. అందులోనూ అపక్వాహారం స్వీకరించడం వల్ల సాధకులకు కలిగే ప్రయోజనం అపరిమితమై వుంటుంది. సుదీర్ఘకాలం అపక్వాహారం స్వీకరించి అందలి ప్రయోజనాలను స్వానుభవంతో గుర్తించినాను.

“సృష్టి యందు 84 లక్షల జీవరాసులు ఉన్నప్పటికీ వంట చేసుకొని భుజించువాడు మానవుడొక్కడే. తక్కిన జీవరాసులు అపక్వాహారమునే భుజించుచున్నవి. ప్రకృతి సిద్ధమగు ఆహారమునే గైకొనుచున్నవి. తత్ఫలితముగ ఆరోగ్యముగా నున్నవి. మానవుడో ప్రకృతియందు నైజముగ లభించిన ఆహార పదార్థములను వికృత మొనర్చి జిహ్వాచాపల్యముచే వానికి పెక్కు రుచులను కల్పించి భుజించుటవలన ఆరోగ్యము చెడి పెక్కు వ్యాధులకు లోనగుచున్నాడు.

ప్రకృతి యందు స్వతస్సిద్ధముగ లభించిన వస్తువులను ఉడకబెట్టునపుడు వాని యందలి కొన్ని జీవాణువులు నశించిపోవును. దృష్టాంతమునకు ఒక పెసరగింజ యున్నదనుకొనుడు. దానిని భూమిలో పెట్టి ఒకటి రెండు రోజులు నీళ్లు చల్లినచో వెంటనే మొలకెత్తును. దానియందలి జీవశక్తులత్తరి వికసించును. కాని ఆ గింజనే పెనముపై పెట్టి వేయించి, లేక ఉడుకబెట్టి భూమియందు నాటినచో కోటి సంవత్సరములకైనను అది మొలకెత్తనేరదు. కారణమేమి ? దానిలోని జీవకణములు కొన్ని నశించిపోయినవి. జీవశక్తులచే పరిపూర్ణమైయున్న పదార్థమును గైకొనుటయే మనుజునకు ఉత్తమము. అనగా అపక్వాహారమును గైకొనుటయే ఆరోగ్యకరము.

అయితే గోధుమలు, పెసలు మొదలగునవి పచ్చివి నములుటకు కఠినముగా నుండును. వానిని కొంతసేపు నీటిలో నానవేసి భుజింపవచ్చును. తాజా ఫలములను స్వీకరించుట వలన ఆరోగ్యము పెంపొందును. అపక్వాహారము గైకొనువారికి కొబ్బరికాయ అతిముఖ్యమైనది. మన పూర్వులు నారికేళమున కెంతయో పూజ్యత్వము కల్పించిరి. దేవతల కందరికి నారికేళము నివేదనముగా సమర్పింపబడు చున్నది.

ఆరోగ్యమునకు ఎంతయో సహాయపడునట్టిదియు, మిక్కిలి విలువైనదియునగు రేడియం అను పదార్థము కొబ్బరికాయ యందు ఎక్కువగ గలదని ఇటీవల శాస్త్రజ్ఞులు పరిశోధనచే కనిపెట్టిరి. కొబ్బరి, అరటిపండ్లు, గోధుమలు, శనగలు – ఈ నాలుగును అపక్వాహారము స్వీకరించువారికి చాల అవసరములై యున్నవి. వారివారి జీర్ణశక్తి ననుసరించి పూటకు ఒక గుప్పెడుకాని, రెండు గుప్పెళ్లుగాని, లేక మూడు గుప్పెళ్లుగాని నానవేసిన గోధుమలు, శనగలు వాడుకొనవచ్చును. పండ్లు ఏవి భుజించినను మంచిదే. అన్నింటికంటె అరటిపండు శ్రేష్ఠము. అది చవుకగా లభించును. పండ్లు దొరకనిచో పచ్చికాయగూరలు గూడ వాడుకొనవచ్చును.

ఉడికిన పదార్థమేమియు లేక రెండు పూటలు అపక్వాహారము భుజించుట సర్వశ్రేష్ఠము. దానిచే రోగములు హరించిపోవును. కావున రోగము కలవారు కనీసము రోగము తొలగువరకైనను అపక్వాహారము శీలించుట ఉత్తమము.

ఒకవేళ రెండు పూటలు అపక్వాహారమును సాధింపలేనిచో కనీసము రాత్రి పూటయైన అన్నము మాని ప్రకృతి ఆహారమును స్వీకరించుట మంచిది. బాగుగ అభ్యాసమైన వెనుక పూర్తిగ అన్నమును విసర్జించవచ్చును. అపక్వాహారమును సాధించుకాలములో పాత మురికి

రక్తము పోయి దాని స్థానము నందు క్రొత్త నిర్మల రక్త మేర్పడును. కావున ఆ మార్పుదల సమయమున ఒకవేళ ఏవైన కురుపులు, దగ్గు మొదలగు వికారము లొకింత కనుపించినను దానిచే సాధకుడు జంకరాదు. బెదరిపోరాదు. తన నియమమును అప్రతిహతముగ కొనసాగించుచునే యుండవలయును. కొంతకాలమునకు వికారములన్నియు తొలగి చక్కని ఆరోగ్య మేర్పడును.

కొందరు కొబ్బరి అజీర్ణమును గలుగజేయుననియు, అరటిపండు వాతమనియు, గోధుమలు వేడిచేయుననియు, శనగలు కడుపుబ్బరము కలిగించుననియు ఇంకను పరిపరివిధములుగ ఆయా వస్తువులను గురించి చెప్పుదురు. కాని ఆయా వికారము లన్నియు ఉడికిన పదార్థములతోబాటు పైపెచ్చు వానిని స్వీకరించినపుడు కలుగవచ్చునేమో కాని ఉడికిన పదార్థములు పూర్తిగ త్యజించి కేవలము వానిని సేవించునప్పుడు, అనగా అపక్వాహారమును గైకొనునప్పుడు ఎంతయో ఆరోగ్యమును గల్గించును. పైగా పెక్కు రోగములను నివారించును. కాబట్టి ఆరోగ్యమును కాంక్షించువారు, రోగబాధను తొలగించుకొన దలంచువారు ప్రయత్న పూర్వకముగ కొంతకాలమైనను ఈ అపక్వాహారమును సేవించుట ఉత్తమము.

అధ్యాత్మరంగమున ప్రవర్తించు సాధకుల కీ పయక్వాహారము ఎనలేని సహాయమును చేకూర్చును. ఏలయగా సత్త్వగుణము నయ్యది వృద్ధిపరచి రజోగుణ తమోగుణములను పారదోలును. కాన ముముక్షువుల కియ్యది వరప్రసాదమే యగును.

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు క్రిందివారు పైకం పంపినారు

1.	కె.మీనాలక్ష్మి (పెనుగొండ, ప.గో.జిల్లా)	రూ.63,636/-
2.	అరుణ గారు, యు.ఎస్.ఎ.	రూ.10,000/-
3.	ఓరుగంటి సరోజాదేవి (హైద్రాబాద్)	రూ.25,000/-

సద్గురు బోధ

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

జీవన్ముక్తునిలో జ్ఞానముగాని, యోగముగాని, ఉపాసన గాని, నిష్కామకర్మయోగముగాని ఒకటి ముఖ్యముగా, లేక అధికముగా కనబడినను తప్పనిసరిగా తక్కిన మూడు యోగములున్ను గౌణముగా కనబడకపోవు. అది వారి సంస్కారము. అంతే మనము చెప్పవలసినది గాని, అట్లుండవలెను, ఇట్లుండవలెను అని శాసించుటకు మనకు అర్హత లేదు. మనమేమి ? వేదమునకే (శాసించు) అర్హత లేదని శాస్త్రము చెప్పుచుండగా మనమా వానిని నిర్ణయించువారము ? ఈ నాలుగు యోగములున్ను సృష్ట్యారంభమునుండి జీవుల సంస్కారము ననుసరించి సర్వేశ్వరుడే యేర్పరచినట్లు శాస్త్రములు ఉద్ఘోషించుచున్నవి. కావున నాలుగు యోగములున్ను ప్రతి మహాత్మునియందును హెచ్చుతక్కువలుగా కనబడుచునే యున్నవి. అట్లుండ వలెననియు భగవానుని యొక్క ఆశయము.

అట్లయిన ఏసంస్కారముగల జీవులకైనా అట్టి మహాత్ముని ఆశ్రయించి తరించుటకు అవకాశము గలుగును. అంతే గాదు, బ్రహ్మవేత్తలలో గూడ హెచ్చుతక్కువలను భావము ఆ మహనీయాత్ములకు గూడ నుండదు. లేనిచో నేను ఎక్కువవాడను. నాది జ్ఞానయోగము, మరియొకడు ఉపాసనాయోగము గలవాడు, ఇంకొకడు నిష్కామకర్మయోగి అను నిటువంటి భేదములు జనించును. భేదమెచ్చట జనించునో అచ్చట తప్పనిసరిగా బాధయున్ను గలుగకపోదు. ఈకారణములు అన్నియు ఆలోచించుకొనియే శ్రీకృష్ణభగవానుడు సర్వజనులు తరించవలెనను ఆశయముతో గీతాశాస్త్రమును నిర్మించెను. నదులు ఏ దిక్కులలో ప్రవహించినను, కట్టకడకు ఏకమగు మహాసముద్రములో పోయి చేరునట్లు

పై నిరూపించిన నాలుగు యోగములలో కట్టకడపటి వరకు వెళ్ళిన అనంతమగు జ్ఞానసాగరములో అందరున్ను ప్రవేశించి అమృతత్వము నొందగలరు.

వ్యష్టికి బుద్ధికి పరముగాను, సమష్టికి మాయకు పరముగాను దాటి వెళ్ళినచో అచ్చట ఏకమైన సత్తుమాత్రమే ఉండును. భూమియొక్క సరిహద్దు దాటిపోయిన తరువాత అన్ని నదులున్ను సముద్రములో చేరునట్లు ఉపాధి ద్వయములను భేదించి వెళ్ళినచో అచట "ఓం తత్ సత్ " అనేదొకటి మాత్రమే నిలుచును. భూమిని దాటిన పిమ్మట నదియొక్క నామరూపములు మాయమైపోయి అనేక దిక్కులనుండి ప్రవహించి, ప్రవహించి వచ్చిన నదులన్నిటియొక్క భేదమును స్ఫురింపజేసెడు భావముపోయి అభేదమైన ఒకే జలమే అన్ని నదులున్ను పొందినట్లు మనము గూడ నేదైన ఒక మార్గమును ఆధారము జేసికొని కడవరకు వెళ్ళిన అఖండమైన దైవమును లేక బ్రహ్మమును పొందగలము. ఈ విషయమై శ్రుతి స్మృతులు అనంత ముఖములతోనుద్ఘోషించుచున్నవి. అదంతయు వ్రాసిన నీ చిన్నవ్యాసము చాల పెరిగిపోవును. వాటిని ఇదివరలో వ్రాసిన గ్రంథములలో చాల వరకు నిరూపించడమైనది. ఇక కాండత్రయాత్మకమే వేదమనియు, వేదసారమగు గీతయు కాండత్రయాత్మక మని కొంచెము నిరూపించవలసియున్నది. ఇచ్చట శ్రీమధుసూదన సరస్వతీస్వాములవారు గీతావ్యాఖ్యానమునందు నిరూపించినది చూడుడు.

సహేతుకస్య సంసారస్యాత్యంతోపరమాత్మకమ్ ।

పరం నిశ్శ్రేయసం గీతాశాస్త్రస్యోక్తం ప్రయోజనమ్ ॥

సచ్చిదానందరూపం తత్పూర్ణం విష్ణోః పరం పదమ్ ।

యత్ప్రాప్తయే సమారబ్ధా వేదాః కాండత్రయాత్మకాః ॥

కర్మోపాస్తి స్తథా జ్ఞానమితి కాండత్రయం క్రమాత్ ।

తద్రూపాష్టాదశాధ్యాయైర్గీతా కాండత్రయాత్మికా ॥

సహేతుకమైన సంసారముయొక్క నివృత్తిరూపకమైన మోక్షము నొసంగుటయే గీతాశాస్త్రమునకు పరమ ప్రయోజనమని చెప్పబడినది. సచ్చిదానంద రూపమగు పరిపూర్ణ పరమపద ప్రాప్తికొఱకే వేదములు గూడ కాండ త్రయాత్మకముగా నారంభింపబడినవి. కర్మ, ఉపాసనా, జ్ఞానకాండములని వానికి పేర్లు. ఆ వేదరూపమై అష్టాదశాధ్యాయములతో గూడిన భగవద్గీతయు, క్రమముగా కర్మ, ఉపాసనా, జ్ఞానకాండ త్రయాక్మకమై యున్నది. మరియు ఈ భగవద్గీత సర్వశాస్త్రమయీ అని తెలుపునట్టి నీలకంఠ వ్యాఖ్యను చూడుడు.

భారతే సర్వవేదార్థో భారతార్థశ్చ కృత్స్నశః ।

గీతాయామస్తి తేనేయం సర్వశాస్త్రమయీ మతా ॥

సమస్త వేదార్థములును భారతమునందున్నవి. ఆ భారతార్థమంతయు గీతయందున్నది. అందువలననే గీత సర్వశాస్త్రమయీ అని చెప్పబడినది.

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

01.	శ్రీమతి సి.హెచ్. కళ్యాణి (హైద్రాబాద్)	రూ.2000/-
02.	శ్రీమతి సి.హెచ్. తరుణి కుమారి (హైద్రాబాద్)	రూ. 2000/-
03.	బోడా చెన్నారావు (శ్రీకాకుళం)ఇదివరకు చెల్లించినదిపోను	రూ.501/-
04.	కొత్తపల్లి శ్రీహరిబాబు (తాళ్లపాక)	రూ.1500/-
05.	విష్ణుబోట్ల శ్రీనివాస్ (హైద్రాబాద్)	రూ. 1500/-
06.	కొత్తపల్లి రవీంద్ర (హైద్రాబాద్)	రూ. 1500/-
07.	ఎల్లంభట్ల భరత్ శర్మ (గంధం గూడ)	రూ. 1500/-
08.	కె.రవి (సికింద్రాబాద్0	రూ.1500/-
09.	వసంతరావు అవధాని (మంథని)	రూ.2000/-

శరణాగతి

- శ్రీ రామకృష్ణ పరమహంస

“ పరమేశ్వరేచ్ఛే జరుగుగాక ” అని నిర్మలమైన భక్తితోను, నిష్కపటమైన విశ్వాసంతోను ఎవడు భగవంతునికి తనను తాను సమర్పించుకొంటాడో అలాటివాడు శీఘ్రంగా సాక్షాత్కారం పొందుతాడు.

సంసారంలో వుండటంగాని, సంసారాన్ని త్యజించటం గాని పరమేశ్వరేచ్ఛమీద ఆధారపడి వుంది. కాబట్టి సర్వం ఆ పరమేశ్వరుడికే సమర్పించి కర్మలు నిర్వర్తించు. అంతకంటె నువ్వు చెయ్యగలిగిందేమిటి ?

ఆరుబయలు పొలంలోని చిన్న గుంటల్లోని నీటిని ఎవరూ వాడుకోకున్నా త్వరలోనే ఎండిపోతుంది. అలాగే పాపాత్ములు ఒకొక్కప్పుడు పరమేశ్వరుని కరుణను కృపను అనన్యగతిగా నమ్ముకొని కేవలం అతడికి ఆత్మార్పణ చేసుకొని తరిస్తారు.

ముక్త్యారునామా (Power of attornery) కు మించిన సులువు సురక్షితమూ ఐన వేరేమార్గం లేదు. ఇక్కడ ముక్త్యారు నామా అంటె ‘నాది’ అనే భావం పూర్తిగా విడిచి సర్వేశ్వరేచ్ఛకు పరిపూర్ణంగా తనను తాను సమర్పించుకోవడం అని భావం.

కోతి తిరుగాడుతూంటే దాని పిల్ల తల్లిని గట్టిగా అంటి పట్టుకొని వుంటుంది. పిల్లికూన అలాగాక జాలిగొలిపేట్లు మ్యావ్, మ్యావ్ మంటూంటుంది. అప్పుడు దానితల్లి మెడపుచ్చుకొని (సురక్షితమైన చోటికి) తీసుకుపోతుంది. కోతిపిల్ల తన పట్టును విడిచిందా, కిందపడి దెబ్బతింటుంది. ఎందుచేతనంటే అది తన బలాన్నే నమ్ముకొని వుంది. కాని పిల్లిపిల్లకు అలాటి భయం కించిత్తూలేదు, తల్లే దాన్ని ఒక చోటి నుంచి మరోచోటికి తీసుకుపోతుంది. భగవంతుడికి పూర్తిగా ఆత్మార్పణం చేసుకోటానికి తనను తాను నమ్ముకొని వుండటానికి వున్న భేదం యిలాటిది.

ఒకడు తన యిద్దరు చిన్న కుమారులతో పొలం మీదుగా పోతున్నాడు.

ఒకణ్ణి ఎత్తుకొన్నాడు. రెండవవాడు తండ్రి చేతిని పట్టుకొని నడుస్తున్నాడు. అప్పుడు వారికి ఆకాశంలో ఎగురుతున్న ఒక గాలిపటం కనిపించగా, తండ్రి చేతిని పుచ్చుకొన్న కొడుకు తన పట్టును విడిచి చప్పట్లుకొడుతూ, “నాన్నా ! నాన్నా! అదిగో, గాలిపటం!” అటూ ఆనందంతో కేకలు పెట్టసాగాడు. ఇంతలో ఆ బాలుడు తడబడి పడిపోయాడు. దెబ్బలు తగిలాయి. తండ్రి ఎత్తుకొన్న బాలుడూ ఆనందంతో చప్పట్లుకొట్టాడు. కాని తండ్రి పట్టుకొని వుండటంతో కిందపడలేదు. ఆధ్యాత్మిక విషయంలో స్వయం సాహాయ్యాన్నీ,పురుషకారాన్నీ నమ్ముకొన్నవాడే యిందులో మొదటి బాలుడు. భగవంతుడికి ఆత్మార్పణం చేసుకొన్నవాడే రెండో బాలుడు.

వెయ్యి చిల్లులున్న కడవతో నీళ్ల తెచ్చి శ్రీమతి (రాధాదేవి) తన పవిత్రతను ఋజువు చేసుకోవాల్సి వచ్చినప్పుడు ఒక్క నీటిబొట్టైనా కిందపడకుండ తేగలిగింది. దాన్ని చూసి అందరూ “ఇలాటి పతివ్రత యింతకుముందు లేదు. ఇకముందు వుండబోదు” అని చాటిస్తూ ఆమెను అమితంగా కొనియాడు సాగారు. అప్పుడు రాధ యిలా అంది. “నన్నెందుకు నుతిస్తారు ! కృష్ణుడికి జేజేలు కొట్టండి ! ఈ మహిమ అంతా అతడిది కాని నాది కాదు. నేను కేవలం ఆతడి సేవికను?”

సంపూర్ణమైన ఆత్మార్పణస్థితి ఎలాటిదో తెలుసా ? రోజంతా కష్టపడి పనిచేసి అలసిపోయిన వ్యక్తి దిండుమీద చేరగిలబడి తీరుబడిగా చుట్టకాలుస్తూ అనుభవించే సుఖమైన విశ్రాంతి లాటిది. అప్పుడు అంతా కేవలం నిర్విచారం !

అన్నం తిని పారేసిన ఆకు మాదిరి లోకంలో మసలుకో. అది ఒకప్పుడు యింట్లోకి మరొకప్పుడు పెంటమీదికి గాలిచేత ఎగురగొట్టబడి దానికి వశమై వుంటుంది. దైవవశాత్తు నువ్విప్పుడు యిక్కడున్నావు, మంచిదే, యిలాగే వుండు. ఇక్కణ్ణుంచి తీసేసి దైవం మళ్లా నిన్నింత కంటె ఉత్తమస్థితిలో వుంచుతాడనుకో. అప్పుడూ పూర్తిగా అసంగుడవై, “దైవేచ్ఛ జరుగనీ!” అనే ఆత్మార్పణబుద్ధితో వుండు. ఏం జరిగినా జరుగ నివ్వు, నువ్వు మాత్రం నిశ్చింతుడవై వుండు.

“ భాగవత సుధ ”

– శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు,

(గండిక్షేత్రము)

భాగవత కథా రసికులగు ఆత్మీయ ప్రియ బంధువులారా !

భాగవతము, పంద్రెండు స్కంధాలతో వుండే కల్ప వృక్షము. ప్రథమ స్కంధంలో పరీక్షిత్తుని నిర్వేదము ముఖ్య విషయము. కష్టం వచ్చినప్పుడు కల్గే వైరాగ్యము నిర్వేద గర్భ వైరాగ్యము. బ్రహ్మ జ్ఞాని యొక్క వైరాగ్యము జ్ఞానగర్భ వైరాగ్యము. పురాణ వైరాగ్యము, శ్మశాన వైరాగ్యములు, ప్రసూతి వైరాగ్యము అంటారే – యివి తాత్కాలికాలు. ఇవి అపర వైరాగ్యాలు. విషయములు మిథ్యా మాత్రములనే అనుభవముతో కూడినది పర వైరాగ్యము.

ద్వితీయ స్కంధం నుండి శుకుని బోధ ప్రారంభమైంది. తృతీయ చతుర్థ స్కంధాలను దాటుకొని పంచమ స్కంధంలో మనం ప్రవేశించినాము.

ప్రియవ్రతుని కథతో ఈ స్కంధము ప్రారంభమైతుంది. ప్రియవ్రతుని కుమారుడు అగ్నీధ్రుడు. అగ్నీధ్రుడు “పూర్వ చిత్తి” అనే అప్సరస వలలో పడి సంసారి అయ్యాడు. అతని కుమారుడు ‘నాభి’ అనేవాడు. పూర్వ జన్మాల సంస్కారాల విశేషమే పూర్వ చిత్తి. దీని బలమైన స్వరూప స్వభావం ఈ భరతుని కథలో బైటపడింది.

నాభి కుమారుడు ఋషభుడు. ఆయన తన ధర్మపత్నితో కూడి తపస్సు చేశాడు. “భగవంతుడు తమకు పుత్రుడుగా కల్గా ”లని వారి అభిప్రాయం. మన దేశము మాతృ ప్రధాన దేశము. పాశ్చాత్య దేశాలు పత్నీ ప్రధానాలు. వినోబాజీ ఒకసారి ఒక మాట అన్నారు. “ఈనాటి స్త్రీలు చక్కని భార్యలు కాగల్గుతూన్నారు కాని, చక్కని తల్లులు కావడం లేదు” అని. ఆనాటి స్త్రీలు తమ శరీరాన్ని ఎంతో గోప్యంగా ఆచ్ఛాదితం

చేసుకొనేవారు. ఎంత వెల్లడి చేసుకొంటే అంతటి నాగరికత ఈనాటి పద్ధతి. శీతరక్షణకూ శీల రక్షణకూ పనికిరాని వస్త్రధారణము నేటి ‘ఫ్యాషన్’. ఇదొక్క ప్రపంచం.

భగవంతుని అవతారాలలో ఋషభుడొక అవతారంగా చెప్పబడినాడు. ఆయన రాజ్యపాలనం చేసి కొడుకులను పెద్దవాళ్ళను చేసి చక్కని బోధ చేసి విరక్తుడై అవధూతయై అరణ్యాల కెళ్ళాడు.

ఋషభుని బోధ ఒక మంచి ఘట్టం. సంస్కృత భాగవతంలో – ఆచోట మంచి మంచి శ్లోకాలున్నాయి.

ప్రభుదత్త బ్రహ్మచారిగారు భాగవత కథలను అరవై భాగాలతో పూర్తిచేసి – స్తోత్ర భాగాలను, ఉపదేశ భాగాలను “భాగత దర్శన” మనుపేర మరి అరవై పుస్తకాలుగా శ్లోక సహితంగా రచించారు.

ఋషభుని జ్యేష్ఠపుత్రుడు భరతుడు. “వార్థకే ముని వృత్తీనాం” అని కాళిదాసు చెప్పినట్లు రాజ్య పాలనం తర్వాత ఆ భారాన్ని పుత్రులకు అప్పగించి గండకీ నదీ తీరమైన పులహాశ్రమం చేరుకొన్నాడు.

“ భరతస్తు మహా భాగవతు”దని సంస్కృతంలో “ భరతుడు మహాభాగవతు” డనిపించుకొన్నాడు. అంతటివాడు కూడ జింకపిల్ల వ్యామోహంలో ‘పల్టీ’ కొట్టాడు.

ఎంతటివాడైనా జాగ్రత్తలో వుండాలె – మాయా ప్రభావం ఘనమైంది. “లౌకిక మాయ దృష్టిచే ననంత” మని ఆర్యోక్తి. “మహా మహాంతో ఉ పి మహేంద్రజాలే మజ్జంతి ”– అని శంకర విజయంలోని వాక్యము. ఒక చండాలుడు శంకరాచార్యుల వారిని దెప్పి పొడిచాడు. “అద్వైతం మాటలలో – ఆచరణ మాయలో”. సమర్థుడు కాబట్టి, ఆచార్యుడు మాట మాత్రంతోనే తెప్పరిల్లుకొన్నాడు.

“వార్తాలాపం” అనే గ్రంథంలో ఒక విషయం వుంది. ఒక మహానుభావుడు జ్ఞాని వున్నాడు. మాయ అనేక విధాల ఆయన్ను పట్టి

చూచింది. దాని ఆట సాగలేదు. శివుడు కాముణ్ణి దహిస్తే, బుద్ధుడు మారుని జయించాడు. నిజానికి ఇదే గొప్పేమో ! అనిపిస్తుంది.

ఆయనకు చివరి ఘడియలు వచ్చాయి. అంతిమ ప్రయాణ మాసన్నమైంది. గడియో రెండు గడియలో గడువు. మాయ వచ్చి "తప్పించు కొన్నావే" అని అనింది. "ఈ గడియ పోయినాక అను ఆ మాట" అన్నాడాయన.

మనస్సు టక్కరిది. సాధకుడు చివరి వరకు దాన్ని నమ్మరాదు. వైకుంఠపాళి (పరమపద సోపాన పటము) ఆటలో పెద్ద పామును కూడా దాటిపోయిన తర్వాత – వాని గెలుపు నిజం.

భరతుని ఈ చరిత్ర విష్ణుపురాణంలో వుంది. నారద పురాణంలో కూడా వుంది. చాలామందికి ఈ కథ ఒక మంచి గుణపాఠం. సంఘసేవ – సమాజోద్ధరణం, పెద్ద పెద్ద మాటలు. ఈ సేవలు అహంకారానికి చేసే పూజలు. కసాయి వాడు గొర్రెకు చేసే సేవ. జీవసృష్టిని జయించకున్నంత వరకు ఈశ్వర సృష్టి బాధకమయ్యే వుంటుంది. జీవసృష్టి రాగద్వేషాలు, ఈశ్వర సృష్టి దేశకాలాలు.

దయ అనే వేషం వేసుకొని మాయ – మమకారం భరతునిలో ప్రవేశించింది.

" దిక్కులేని లేడిపిల్ల తల్లిని పోగొట్టుకుంది. నేను లేకపోతే దీనికి యేది గతి ? అనాథ శిశురక్షణం అన్ని యజ్ఞాల కంటే మించిన ఫలము. 'పరోపకారాయ సతాం విభూతయః " – మాబోటి సాధువుల కర్తవ్యమే యిది" అని తనలో తాను స్వయంపాక సంసార వ్యాపారం.

ఇంతవరకు బాగానే వుంది. ఉప్పు ఎంత వేసుకోవాలో అంత వేసుకొంటేనే రుచి. 'రుచి కదా' అని పట్టెడుచోట పుట్టెడు వేస్తే ! ఏమంటారు?

జారడమంటూ ప్రారంభమైతే – ఆ జారడానికి అంతు పంతు

వుండదు. "పెక్కు భంగులు వివేక భ్రష్ట సంపాతముల్" భరతుడు మహావివేకే! ఆయనకంటే ఆ మాయ మరింత గొప్పది.

ఈచోట ప్రభుదత్త బ్రహ్మచారి రచన చదవదగి వుంది. కావ్య భాషలో వ్రాసుకెళ్లారు.

శివాజి పెద్ద కోట కట్టిస్తూన్నాడు. వేలమంది ఆ పని చేస్తున్నారు. ఆయన ఒక పెద్ద గుండు మీద కూర్చొని పరికిస్తూన్నాడు. "నాతో యింతమంది బ్రతుకుతూన్నారు కదా ! " లోపల అహంకారం దూరింది. ఎక్కడ నుంచి వచ్చాడో కాని, అంతలో గురువు సమర్థ రామదాస స్వామి పావుకోళ్ళు పటపట పల్కుతూంటే వచ్చి ప్రక్కన నిలబడ్డాడు. ఉలిక్కిపడి ఛత్రపతి శివాజి లేచి సాష్టాంగ నమస్కారం చేశాడు. " శివా! ఆ పని మనిషిని ఇక్కడికి రమ్మను. ఈ గుండును పగులగొట్టించు.."

గుండు రెండుగా బ్రద్దలైంది. దాని మధ్యలో కప్ప ఒకటి, కాసిన్ని నీళ్లు ప్రత్యక్షమయ్యాయి. "శివాజీ ! ఈ కప్పను కూడా బ్రతికించేది నీవేనా? పిచ్చివాడా ! నాతి గర్భంలో శిశువును, రాతి మధ్యలోని కప్పను బ్రతికించే శక్తి అందరినీ బ్రతికిస్తుందయ్యా !"

భాగవతానికి తెలుగులోనే యెందరో అనువాదాలు వ్రాశారు. సంస్కృత భాగవతాన్ని అనుసరించి కొందరు – పోతన భాగవతాన్ని అనుసరించి కొందరు గద్యంలో వ్రాశారు. ఆసక్తి కలవారు ఆ అన్నిటినీ చదవండి మంచిదే. అయితే నా రచన సంగతా – ఇదొక్క పాకం.

జింకనే చూస్తూ ప్రాణం వదిలాడు. "యద్భావం తద్భవతి". కరెంట్ వుండే వరకు టేపు రికార్డు పనిచేస్తుంది. కరెంటు ఆగేసరికి – ఆ చివరి మాటతో ఆఖర్. ప్రాణం కరెంటు. ప్రాణం వుండేవరకు సంకల్పాలు తిరుగుతూంటాయి. ప్రాణం ఆగింది. మనస్సు చివరి సంకల్పం మీద నిలుస్తుంది. 'బ్రాటోవర్' అన్నట్లు, ఆ సంకల్ప రూపమైన జన్మే తర్వాత వస్తుంది. భరతునికి జింకజన్మ వచ్చింది. పశ్చాత్తాపపడ్డాడు.

ఆచార్యోపాసనమ్

- శ్రీ శివదేవానందస్వాములవారు, దావణగెరె

(పూజ్యశ్రీ శివదేవానంద స్వాములవారు శ్రీ వ్యాసాశ్రమ బ్రహ్మవిద్యా పాఠశాలలో కొద్దికాలం అధ్యయనం చేసి పూజ్యశ్రీ రామకృష్ణానంద స్వాములవారి వద్ద (గండి)సన్న్యాసం తీసుకొన్నారు. శ్రీవారు బ్రహ్మలీనులైనారు.

అస్మద్గురువరేణ్యులు పూజ్యపాద శ్రీరామకృష్ణానందస్వాములవారి శ్రీచరణాలకు ప్రణామాలు. ఆంధ్రదేశపు ఆధ్యాత్మిక పితామహులు శ్రీ సద్గురు మలయాళస్వాములవారికి నమః సుమాంజలులు. పండిత పామరులనక ఆబాలగోపాలం చేత గీతామకరందాన్ని ఆస్వాదింపజేసిన, ప్రస్తుతము ఆంగ్లభాషాభిమానుల చేతను, కన్నడాభిమానుల చేతనూ గీతామకరందాన్ని ఆస్వాదింపజేస్తున్న బ్రహ్మలీన పరమ పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారికి నా నమోవాకములు. సకల గురుభక్తులకు, సాధకులకు హార్దిక శుభాభినందనలు.

ఆత్మీయులారా !

'అధ్యాత్మవిద్యా విద్యానాం' అని భగవంతుడు గీతలో సెలవిచ్చాడు. అంటే ఆత్మను తెలుసుకొనే విద్య. ఈనాడు దేహాన్ని పెంచే, అన్నాన్ని సంపాదించుకొనే విద్యలకు చాల ప్రాధాన్యత ఏర్పడింది. శ్రీరామకృష్ణ పరమహంస గారి అన్న 'రాంకుమార్' తమ్ముడితో అన్నారు. 'శ్రద్ధగా చదువు నేర్చుకో, చదవకపోతే ముందు ముందు నీపొట్ట గడవటం ఎలాగ?" అంటే, ఆయన " ఆ పొట్టకూడు సంపాదించి పెట్టే విద్యలు నాకు వద్దు పొమ్మ"న్నాడు. ఆత్మలాభానికై భగవల్లాభానికై పరితపించాడు. అన్నంతో ఆకలి బాధ తాత్కాలికంగా ఉపశమిస్తుంది. శోకమోహాలను

రాగద్వేషాది క్లేశాలను అంతరింపజేసేది ఒక ఆత్మజ్ఞానం మాత్రమే. 'ఆత్మవిత్ శోకం తరతి' ఆత్మవిదుడు మాత్రమే శోకాన్ని దాటగలడని ఉపనిషత్తు చెబుతున్నది. ఈ ఆత్మజ్ఞాన ప్రాప్తి కావాలంటే గురువవసరము. "ఆచార్యవాన్ పురుషో వేద", "స గురుమేవాభిగచ్ఛేత్", "తద్విద్ధి ప్రణిపాతేన... ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః" అంటూ శ్రుతులు, స్మృతులు ఆదేశిస్తున్నాయి.

" గురుమేవ అభిగచ్ఛేత్" – గురుమేవ – 'ఏవ' శబ్దం వల్ల ఈ జ్ఞానం గురువుద్వారానే పొందదగినది, 'నాన్యః పంథా – మరోమార్గం లేదు' అని తెలుస్తూ వుంది. అంటే ఇది పుస్తకాలవల్ల నేర్చేసుకొనే విద్య కాదు. 'రోడ్ మ్యాప్ " చూసుకొని ఏదో క్రొత్తవూరికి పోయేటంత సులభం కాదు ఇది. ఎందుకంటే ఇది బాహ్యప్రయాణము కాదు, దూరంగా ఎక్కడో లేదు. అది మన స్వరూపమే అయియుంది. నిత్యసిద్ధమైయుంది. అది కర్మసాధ్యం కాదు.'నాస్త్యకృతః కృతేన పరీక్ష్యలోకాన్ నిర్వేదమాయాత్' వైరాగ్యాన్ని పొంది సద్గురువును ఆశ్రయించి సేవించి తెలుసుకోవాలి.

ఆచార్యుడంటే, గురువంటే ఎవరు ? "శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు" అని ఉపనిషత్. "జ్ఞానినః తత్త్వదర్శినః" అని భగవద్గీత చెబుతున్నాయి.

ఉపనీయ తు యః శిష్యం వేదమధ్యాపయేత్ ద్విజః ।

సాంగం చ సరహస్యం చ తమాచార్యం ప్రచక్షతే ॥

ఉపనయనం చేసి వేదాంగములతోపాటు వేదాన్ని అధ్యాపనం చేయించి అందులోని రహస్యాన్ని – చదువులలోని మర్మమును శిష్యుడికి బోధించువాడే ఆచార్యుడని మనువు చెప్పాడు.

శాస్త్రములను మథించి సారాన్ని గ్రహించి దాన్ని తాను స్వయంగా

అనుభవిస్తూ ఆచరిస్తూ శిష్యుడికి కూడా దాన్నే బోధించి ఆచరింప చేయువాడిని ఆచార్యుడన్నాడు.

ఆచినోతి హి శాస్త్రార్థం ఆచారే స్థాపయత్యపి ।

స్వయమాచరతే యస్మాత్ తస్మాదాచార్య ఉచ్యతే ॥

గురువనే మాటకు శిష్యుడి హృదయంలోగల అజ్ఞానాంధకారాన్ని తొలగించువాడనే అర్థము. 'గురు'వంటే బరువైనది అని కూడా అర్థము. బరువైన వస్తువు – ఒక బండ లేదా కొండ – ఏ విధంగా పెద్ద పెద్ద గాలివానలు వచ్చినా చలించదో ఆలాగున ఈ లోకంలో ఎదురయ్యేచ సుఖ – దుఃఖ, మాన– అవమాన, నిందా – స్తుతి, లాభనష్టాలు, శీత–ఉష్ణాలు మున్నగు ద్వంద్వాల తాకిడికి చెక్కు చెదరక నిలవగలిగిన స్థితప్రజ్ఞుడే గురువు. దత్తాత్రేయులవారు పర్వతాన్ని గురువుగా చేసుకొని ఈ పాఠాన్నే నేర్చుకొని మహాగురువయ్యారు.

మొత్తానికి ఇలాంటి లక్షణాలు గలిగిన గురువు నాశ్రయించి సేవా శుశ్రూషలతో మెప్పించి ఈ ఆత్మవిద్యాలాభాన్ని పొందాలి.

తోషితే సద్గురౌ చాష్టసిద్ధయో యాంతి వశ్యతామ్ ।

వేదశాస్త్రాదికం సర్వం సులభం క్షణమాత్రతః ॥

సద్గురువు సంతుష్టుడైతే సిద్ధులన్నీ వశమవుతాయి. వేదశాస్త్రాదుల అర్థములన్నియూ క్షణమాత్రంలో సులభంగా అర్థమవుతాయి.

భగవద్గీత 13వ అధ్యాయంలో అమానిత్వాది గుణాలలో 'ఆచార్యోపాసన' ఒక ముఖ్యమైన జ్ఞాన సాధనగా చెప్పబడింది. అయితే మొదట అమానిత్వం, అదంభిత్వం, అహింసా, క్షాంతి, ఆర్జవం అనే ఐదు సాధనలు చెప్పి తర్వాత ఆచార్యోపాసన చెప్పి యుండటం ఒక స్వారస్యకరవిషయం. అభిమాని, దంభాచారి అయినవాడు గురువును

ఆశ్రయించలేడు, సేవ అసలే చేయలేడు. **అభిమానమంటే ఇతరుల కంటే తానే గొప్పవాడని భావించు కొనటం, దంభమంటే తనలో లేని గొప్పలను ప్రదర్శించాలనుకోవటం.** ఇలాంటి వారు గురువును ఎలా సమీపించగలరు ?! అసలు ఒకరిని గురువుగా భావించట మంటేనే వారు తన కంటే ఎక్కువ తెలిసినవారని ఒప్పుకోవటం, శిష్యుడు కావటమంటే తన అజ్ఞానాన్ని గురువుయొక్క మార్గదర్శనంతో తొలగించుకొనేందుకు సంసిద్ధుడై వుండటము. తన అజ్ఞానపు అథవా అల్పజ్ఞానపు ఎరుక కలిగియుండటము, గురువు యొక్క జ్ఞానము నందు శ్రద్ధ కలిగి యుండటము – ఇదే ఆత్మజ్ఞానానికి ప్రథమ సోపానము.

ఆత్మజ్ఞాన ప్రాప్తియందు అహంకారమే పెద్ద ప్రతిబంధకము. ఈ పరిచ్ఛిన్న అహంకారము, దేహాత్మబుద్ధి శిథిలమయ్యే వరకు జ్ఞానప్రాప్తి కలుగదు. ఈ అహంకార నిర్మూలన కోసమే దండవత్ నమస్కారము, ప్రతీక్షా, శుశ్రూషా మొదలైన ఆచారాలను విధించారు. ఈ సాధనలను యాంత్రికముగా కాక శ్రద్ధాభక్తులతో హృత్పూర్వకంగా చేయాలి. అలా చేసినపుడు హృదయాంతరాళంలోని ప్రతిబంధకాలు తొలగి జ్ఞానధారణకు ఆవశ్యకమైన భూమిక నిర్మాణమవుతుంది. హృదయంలో గ్రహణశీలత (Receptivity) పెరుగుతుంది. అహంకారము వంగితే లోపలి ద్వారాలు తెరుచుకుంటాయి. అలా జరిగినప్పుడు ఒక్కోసారి బయటనుండి ఎవరూ చెప్పకనే లోపలనే బోధ అవగతమవుతుంది. "మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం" అన్నారు గదా! సత్యకాముడు గురువునందు శ్రద్ధ గలిగి శుశ్రూషారతుడై వున్నాడు. తాను మేపుతున్న ఆవులు, అడవిలోని పశుపక్షులు, వృక్షాల నుండే అతనికి బోధ లభించింది. ఏకలవ్యుడు గురువు యొక్క ప్రతిమను ఆలంబనంగా వుంచుకొని గురువు మీది శ్రద్ధను తన హృదయంలోనే పోషించుకొంటూ సాధన చేసి సిద్ధిని పొందాడు.

గురువు లేకపోతే, గురువునందు శ్రద్ధ లేకపోతే అలాంటి మనోభూమిక ఏర్పడటము అసంభవము. గురువులకు వాస్తవంగా మన సేవా శుశ్రూషలు అవసరం లేదు. వారు పూర్ణకాములు. మన ఉద్ధారకాని కోసం మనమే వారినాశ్రయించి సేవించాలి. గీతలో అర్జునుడే “శిష్యస్తే ఽహం శాధి మాం త్వాం ప్రపన్నం ” అంటూ జగద్గురువు నాశ్రయించాడు. అర్జునుడే “ నేను నీ శిష్యుడిని – నీవు నా గురువువు, నన్ను ఆదేశించు, నాకు ఉపదేశించు’ అంటూ తనను తాను సమర్పించుకొన్నాడు. కృష్ణుడు మాత్రం “నేను గురువును, నీవు నా శిష్యుడివి’ అని ఎక్కడా చెప్పుకోలేదు. గురువుకు తాను గురువనే అభిమానం వుండదు. శిష్యుడే తన శిక్షణా పరిపూర్తి కోసం గురువునందు గురుత్వాన్ని అధ్యారోపంచేసి ఆరాధిస్తాడు. జ్ఞానసిద్ధి అయిన తర్వాత “న గురుర్నైవ శిష్యః చిదానందరూపైవ సర్వమ్ ”

ఒకానొక సంత్‌మహాత్ముడు గురుశిష్యసంబంధాలను గూర్చి ఇలా చెప్పాడు – “గురువు తాను గురువని తెలియరాదు. శిష్యుడు తాను శిష్యుడనని మరవరాదు. గురువుకు శిష్యుడి సేవా శుశ్రూషల అవసరముండరాదు. శిష్యుడు గురువుకు సేవాశుశ్రూషలు చేయకుండా వుండరాదు” – అని.

సాధన దృష్టితో చూస్తే ఇచ్చట శిష్యుడి పాత్రయే ప్రముఖమైనదిగా కనిపిస్తుంది. తాను ఎంత శ్రద్ధాభక్తులు గలిగి సేవా శుశ్రూషలు చేస్తాడో అంత ప్రయోజనాన్ని తాను పొందగలుగుతాడు. శిష్యుడే గురువు నాశ్రయించాలి. శిష్యునికే గురువుయొక్క అవసరము. గురువుకు శిష్యుల అవసరంలేదు. అది పూర్ణపాత్ర. అందులో ఇక నింపదగినది. ఏదియూ లేదు. అందులో ఏ కొరతా లేదు.

ఏదో ఉపచారానికోసం (Formality) గురుభక్తి. నమస్కారాలు, పురస్కారాలు చేసేవారికి ఆత్మలాభం కలుగదు. నిష్కపటసేవ, సమర్పణాభావన, శ్రద్ధా, భక్తి, వినమ్రత, నిర్మల హృదయము గలిగిన

పుణ్యవంతుల హృదయంలోనికి ఏదోమార్గం గుండా జ్ఞానగంగ తానే ప్రవేశిస్తుంది.

సద్గురు స్థానాన్ని అలంకరించి లక్షలాది ముముక్షువులకు గీతోపదేశాన్ని చేసిన పూజ్యపాద శ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారు పరమ గురుభక్తిపరాయణులు. జ్యోతిని స్పర్శించి జ్యోతిగా మారునట్లు గురుశుశ్రూషచేత తాము గురుపదాన్ని పొందినారు. ‘తేజస్వినావధీతమస్తు’ – అన్నట్లు తాము నేర్చిన విద్యను విస్తారంగా లోకానికి పంచి విద్యాప్రకాశులనే నామాన్ని సార్థకం చేశారు. తమ ఆశ్రమానికి “శుకబ్రహ్మాశ్రమము” – అని పేరు పెట్టుకోవటంలోనే వారి వినమ్రత, గురుభక్తి పరాయణత విశదమవుతున్నాయి. (వ్యాసమహర్షి పుత్రుడు, శిష్యుడు గదా శుకుడు !) Spritual knowledge is the only solution for all the human problems".(ఆత్మజ్ఞానము ఒక్కటియే అన్ని సమస్యలకు పరిష్కారము) అనునది శ్రీవివేకానంద స్వాములవారి అభిప్రాయము. శ్రీమాన్ మలయాళ స్వాములవారి ఆశయము కూడా అదే “వర్ధతాం బ్రహ్మవిద్యా చ లోకేభ్యః సుఖమేధతాం” బ్రహ్మవిద్యవల్లనే లోకానికి సుఖం – అనే వారి మాట సార్థకం కావలెనని ఆశిస్తాను. జ్ఞానమతము వ్యాపకమగును గాక **! జై గురుదేవ్ ! నమో మహద్భ్యో గురుభ్యః. ఓం తత్ సత్.**

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు ఈ క్రిందివారు పైకం పంపినారు

1. ఎం.నీరజ మరియు బి.చెంగారెడ్డి (పానగల్) – రూ.20,000/–
   (మట్టి సుశీలమ్మ పేరిట అన్నదానానికి నిధి)
2. కె. కుమారస్వామి గారు (కాళీగార్డెన్స్) – రూ.20,000/–
   (డిశంబరు నెలలో ప్రతి 3వ తేది అన్నదానానికి నిధి)
3. కె.కుమారస్వామి (కాళీ గార్డెన్) – రూ. 20,000/–
   (ప్రతి డిశంబర్ 31వ తేది అన్నదానానికి నిధి)
4. ఎం. వీరరాఘవమ్మ (కాళీ గార్డెన్స్) – రూ.20,000/–
   (ప్రతి డిశంబర్ 3వ తేది అన్నదానానికి నిధి)

మాతృ ప్రేమ

– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

బెజ్జమమాదేవి వాత్సల్యం:– సువిస్తారమైన సాహిత్యంలో సంతానానికి తల్లిపట్ల గల ప్రేమ, అలాగే తల్లికి తన కుమారునితో ఆవేదనలు పంచుకొనే ఘట్టాలెన్నో కనిపిస్తాయి. పాల్కురికి సోమన బసవ పురాణంలోని బెజ్జమహాదేవి కథలో తల్లి ఆరాటం కంట తడిబెట్టిస్తుంది.

"తల్లి గల్గిన నేల తపసి కానిచ్చు
తల్లి గల్గిన నేల తలజడల్గట్టు
తల్లి యున్న విషంబు త్రావనేలిచ్చు
తల్లి పాముల నేల ధరియింపనిచ్చు
తల్లి పుచ్చునె భువి తనయుని తిరియ
తల్లి పుచ్చునె సుతు వల్లకాటికిని
తానింత వోడయ్యె తల్లి లేకయును
తానెంత పెరుగునో తల్లి కల్గినను "

మరి కొన్ని కావ్యాలలో వాత్సల్య వర్ణనలు.

' భోజరాజీయం' కథాకావ్యం. ఈ కావ్యంలోనే ఆవు – పులి కథ వుంది. గోమాత పులికి వాగ్దానం చేసి ఇంటికి వచ్చి దూడకు పాలు గుడిపి హితోపదేశం చేస్తుంది.

చులకన జలరుహ తంతువు
చులకన తృణకణము, దూది చుల్కన సుమ్మీ
యిల నెగయు ధూళి చుల్కన
చులకన మఱి తల్లి లేని సుతుఁడు కుమారా

అని జాగ్రత్తలు చెబుతుంది.

కాశీఖండంలోని 'గుణనిధి' కథ ప్రసిద్ధం. శ్రీనాథుడు 'కలవాడు

తమ బిడ్డలు పట్టించుకోకపోతే' ఏలా భ్రష్టులవుతారో విశదీకరించే కథ. తండ్రి కోపానికి గురయిన గుణనిధి ఇంటికి వెళ్ళలేక తిరుగుతూ ఆకలితో అమ్మను తలచుకొని బాధపడే ఘట్టం అవశ్యం పఠనీయం.

అరుణ గభస్తిబింబ ముదయాద్రి పయిం బొడతేర గిన్నెలో
పెరుగును వంటకంబు వడపిందియలున్ గుడువంగఁ బెట్టు
నిర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లి యున్నదే
హరహర ఎవ్వరింక కడుపారఁగఁ బెట్టెద రీప్సితార్థముల్

శ్రీనాథమహాకవి హరవిలాసంలో చిరుతొండనంబి కథలో కూడా

ఉదరమునన్ భరించి ప్రసవోద్భవ వేదనఁ బొంది పిమ్మటన్
ముదిముది యైన పీతఁబడి మూత్రమునన్ బడి లజ్జ నందుగా
న దవడయైన తల్లికిఁ బ్రియంబొ సుతుండు వృథాభిమాన దు
ర్మదుఁడగు తండ్రికిం బ్రియుఁడొ మానసవీధిఁ దలంచి చూడుమా

అని వర్ణించాడు. తెనాలి రామకృష్ణ కవి పాండురంగ మాహాత్మ్యంలో పుండరీకుని వృత్తాంతం ప్రధానకథ. పుండరీకుడు నదీమతల్లులను బలాత్కరించబోగా వారు ముని చెంత దాగారు. పుండరీకుడు మునిని నెట్టివేశాడు. మునికోపంతో పాదహీనుడవు కమ్మని శపించాడు. పుండరీకుడు వేడుకోగా మాతాపితరుల సేవ చేయని వానికి తగిన శిక్ష ఇదే అన్నాడు. పుండరీకుడు అలాగే చేస్తుండగా పాండురంగడు పరీక్షించాలనుకొన్నాడు. తాను వచ్చానని ఎరుకపరచాడు. పుండరీకుడు తాను మాతాపిత సేవలో ఉన్నానని అందాక ఈ ఇటుక మీద నిలబడు అని ఇటుక వేశాడట. పాండురంగడు కటిన్యస్తహస్తుడై ఆలాగే నిలబడ్డాడు. చివరకు స్వామి కరుణించాడు.

వేంకటాచల మాహాత్మ్యంలో వకుళమాలిక

వేంకటేశ్వరుడు వేటకు వెళ్ళాడు. అరణ్యంలో పద్మావతిని చూచాడు. మాటలు గలిపాడు. విరహాతురుడయ్యాడు. పైగా ఆడవాళ్ల దగ్గర రాళ్ళ దెబ్బలు తిన్నాడు. ఆపై ఇల్లు చేరుకొన్న కొడుకును

వకుళమాలిక చూసింది. బాధపడింది. ఏం జరిగిందో తెలియదు. తన వాత్సల్యమంతా కుప్పించి ఆరాతీసింది. ఈ ఘట్టాలను స్త్రీగా కవయిత్రి వెంగమ్మ సుదీర్ఘంగా వర్ణించింది. ముందు పరమాన్నం తిందువురా అని తల్లి కొడుకును పిలిచింది. అతడు రోదిస్తుంటే మృగాలను చూచి భయపడ్డావా? భూతం సోకిందా ? రాళ్ళమీదనడచి జారిపడ్డావా ? వాగుల్లో పడి ఆపై లేచివచ్చావా? అని చికిత్సలకు సిద్ధమయింది. చివరకు వేడి చెమట లేమిటి? మృదు శరీరంలో దెబ్బలేమిటి ? ధీరుడవయినా దైన్యంతో ఏడవడ మేమిటి ? అడుగుతున్నా మౌనమేమిటి అన్నది. చివరకు అన్ని తెలుసుకొని తన అబ్బాయికోసం అమ్మాయిని అడగడం కోసం ఆకాశరాజు దగ్గరికి వెళ్లింది.

ఆధునిక యుగంలో మాతాపితరులను మరువని మహనీయులు

మొగలాయి చక్రవర్తుల విజృంభణానికి అడ్డకట్టవేసిన వీరులలో 'శివాజీ' ఒకడు. అతని తల్లి జిజియాబాయి. శివాజీ ఆశయాల ఎదుగులో ఆమె పాత్ర అనన్యసామాన్యం. చిన్నతనంలోనే సనాతన ధర్మానికి లక్ష్యాలయిన రామాయణ భారత కథలను వినిపించి ధార్మికరక్తిని పెంచిన మాత. శివాజీ ప్రత్యేకతలలో దైవభక్తి. ప్రత్యేకించి భవానీ భక్తి. అలాగే సద్యఃస్ఫూర్తి ప్రధానాంశాలు. గురువు హితబోధలు కూడా శివాజీ ఎదుగుదలలో ప్రముఖ మయినవే.

శివాజీ స్త్రీలను గౌరవించేవాడనడానికి ఒక ఉదాహరణ. ఒకసారి మహారాష్ట్రులు కల్యాణదుర్గం వశం చేసుకొన్నారు. అపారధనం సమకూరింది. శివాజీ సంతోషించాడు. కాని కొలువు కూటంలోని బురఖాస్త్రీని చూచి కలవరపడ్డాడు. ఆమె ఎవరని అడిగాడు. వారు కల్యాణదుర్గం కోడలు అన్నారు. అంతే శివాజీ గతుక్కుమన్నాడు. ఆమెను విడిపించి సాదరంగా కల్యాణదుర్గం పంపించాడు. ఆమెలో తల్లిని దర్శించ గల్గినాడు. ఇది తల్లి దండ్రుల నుండి అతనికి వచ్చిన వారసత్వ సంపద.

గంగాయాం గీత

- శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

కాశీ నివాసము ఒక సంవత్సరము పూర్తికాగా, విద్యాభ్యాసము ముగిసినందున ఆనందమోహనులు, హిందీ విద్యార్థినిగా ఆలహాబాదు వచ్చియుండిన వారి సోదరి, కాశీవిశ్వవిద్యాలయ మందు ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. చదువుచున్న ఆమె భర్తగారు (ఇలింద్ర రంగ నాయకులుగారు) ఒక చోట కలిసికొని అచటనుండి హృషీకేశాది ఉత్తరభారత యాత్రను పూర్తిచేసికొనిరి. ఈ సందర్భములో ఆనందునకొక సమస్య ఎదురాయెను. తన విద్యాభ్యాసమింతటితో పూర్తియగును. స్నేహితులు, కొందరు బంధువులు ఇంకను ఆంగ్లమున ఉన్నతవిద్య నభ్యసించులాగున వీరిని ప్రోత్సహించదొడంగిరి. ఇక విద్యను చాలించి ఆశ్రమ జీవితమును గడుపుమని తల్లిదండ్రులనుచున్నారు. గురువుగారగు శ్రీసద్గురు మలయాళస్వాములవారున్ను అట్లే ఆదేశించుచున్నారు. తనకున్ను ఆశ్రమ జీవితమందే ఇచ్ఛయున్నది. కాని దానికంత ప్రబలత చేకూరక అపుడపుడు ఉన్నత విద్య వైపుకున్ను మనస్సు మొగ్గచూపుచున్నది. 'ఇపుడు భావిజీవిత కర్తవ్యమేమి?' అని డోలాయమానసులగుచుండిరి. ఇట్లుండగా కాశీ వదలవలసిన సమయమాసన్నమాయెను. సోదరి ఆలహాబాదు నుండి వచ్చి కాశీ చేరెను. సోదరి భర్తకు కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. పూర్తియైనది. గాన అందరును కలసి హరిద్వారము, అచటి నుండి ఋషీకేశ్ చేరిరి. హృషీకేశ్‌లో నాడు వీరు మువ్వురూ కలసి గంగాస్నానమునకు వెళ్ళిరి. ఆనందమోహనుగారు తన స్నానాంతరము నదిలో కట్టడియున్న ఒక 'బోటు' లోనికిపోయి అందుకూర్చొని నదిని తిలకించుచుండిరి. ఇంతలో ఆ సమీపమున నదియందొక గడ్డికుప్ప కొట్టుకొని వచ్చుచుండుట వీరి కంటపడెను.

వీరు వంగి వెంటనే దానిని చేతితో తీసి పడవలో వేయగా అందు ఒక నాగరలిపి భగవద్గీత కుంకుమ పుష్పపూజితమై కన్పించెను. వెంటనే ఆనందుడు ఆనందాతి రేకముతో ఒక గంతువేసి తమ సోదరిని, బావగారిని పిలిచి వారికద్దానిని చూపి ఇక తన భావిజీవితమును ఆశ్రమము నందు గడిపి "లోకమున కీ గీతాసేవచేయు"మని భగవదాదేశమై యున్నది. కావున యాత్ర అయినదే ఇంటికేగి అట నుండి ఆశ్రమము వెళ్లెదనని తీర్మానించి తమ కెదురైన సమస్యను పరిష్కరించిరి. మహాత్ములకు దైవమెట్లు తోడగునో చూడుడు. అటు పిమ్మట వారు మధుర, ఆగ్రా మొదలుగాగల ప్రదేశములను, క్షేత్రములను దర్శించి తిరిగివచ్చి ఇల్లు చేరిరి.

గురుకుల వాసము – తపస్సు

గురుదేవులు పూజ్యశ్రీశ్రీశ్రీ ఆసంగానందగిరి స్వాములవారు అనే శ్రీశ్రీశ్రీ సద్గురు మలయాళస్వాములవారి వద్ద 1936వ సం॥ మే నెల 17వ తేది ఏకాదశి పవిత్ర దినంలో గురుకులవాసం చేయడానికి శ్రీ వ్యాసాశ్రమంలో (చిత్తూరు జిల్లా తిరుపతి శ్రీకాళహస్తి క్షేత్రముల మధ్య గలదు) ప్రవేశించారు.

ఇంత వరకు ఆనందమోహన్ గాయత్రి జపము. గురూపదిష్ట శివపంచాక్షరీ జపము చేసి తనకుగల మలదోషం నివృత్తం కాగా ధ్యానసాధనలతో విక్షేపదోషం తొలగిపోగా, మిగిలిన ఆవరణదోషం నివృత్తికై వీరికి శ్రీ సద్గురు స్వాములవారు మహావాక్యోపదేశాన్ని చేయ నిశ్చయించారు. శ్రీ ఆనందమోహను ఏకాంతప్రియుడు, సాధనాప్రియుడు. కాబట్టి శ్రీ సద్గురు స్వాములవారు వీరికి ఆశ్రమంలో దక్షిణవైపు చివర గల గుహాశ్రమాన్ని నివాసానికి ఏర్పాటు చేశారు. 18–4–1936 ద్వాదశినాడు శ్రీ సద్గురు స్వాములవారు ఆనందమోహన్‌ను స్వయంగా పిలిచి "ప్రజ్ఞానం బ్రహ్మ" 'అహం బ్రహ్మాస్మి' "తత్త్వమసి" 'అయమాత్మాబ్రహ్మ" అను మహావాక్యాలను ఉపదేశించారు. ఆ మహావాక్యోపదేశ మనన నిదిధ్యాసనలచే ఈ శిష్యరత్నం యొక్క ఆవరణ దోషం పటాపంచలైనది.

శ్రీ వ్యాసాశ్రమంలో సాధనకై వీరికి సద్గురు స్వాములవారు ఆశ్రమానికి దక్షిణంలో చివరగా ఏకాంతంగా వున్న కుటీరాన్ని ఏర్పాటు చేశారని చదివాము గదా ! శ్రీ వ్యాసాశ్రమం నందిపర్వతం చరియలో వుంది. చుట్టూ ,చిట్టడివి. ఆనందమోహన్ గారికిచ్చిన కుటీరం చుట్టూ దట్టమైన పొదలుగల అడవి. వేసవి రాత్రులందు కొండలలోని ఎలుగుబంట్లు ఆశ్రమం వద్ద గల కొలనులో నీళ్ళు త్రాగడానికి వస్తూ పోతూండేవి. ఒకటి ఏకాంతంగా జనసంచారం లేక చివరలో వుండడం, చుట్టూ ముళ్లచెట్ల పొదలు కలిగివుండడం చేత ఆ కుటీరంలో మంచి వైరాగ్యం గల, భయంలేని సాధువులుండి యుండిరి. ఇపుడు ఆనందమోహన్ నివాసం ఆ గుహాశ్రమమే.

జగద్గురువుకు శ్రద్ధాంజలి

కంచికామ కోటి పీఠాధిపతులు పరమ పూజ్య జగద్గురు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వాములవారు 28-2-2018వ తేది మహా సమాధిని పొందారు. శ్రీవారు వసుధైక కుటుంబం అనే సిద్ధాన్తాన్ని అమలు పఱచినారు. అట్టడుగు బడుగు వర్గాల వద్దకు కూడా తామే పోయి అందరిని అక్కున చేర్చుకొన్నారు. అనేకంలో ఏకతను దర్శనం చేసుకొని అందరిలో ధార్మికజాగృతిని కలుగజేయడానికి సదాప్రయత్నం చేస్తూండినారు. వారు విశ్వంలో విశ్వేశ్వరుని దర్శించారు. అనుష్ఠాన వేదాన్తంలో జీవించారు. వారు మన శ్రీ శుకబ్రహ్మాశ్రమ భక్తకన్నప్ప కొత్త కంటి ఆసుపత్రికి శంఖుస్థాపన చేశారు. వారి పవిత్ర సంకల్పంతో మన కంటి ఆసుపత్రి అనతికాలంలోనే వృద్ధి చెందింది. **అట్లే శ్రీవారు పూజ్య గురుదేవుల శతజయన్త్యుత్సవాలకు 2013 సం॥లో వచ్చి ఉత్సవాలను ప్రారంభించి ఆ ఉత్సవాలకు పరిపూర్ణత్వాన్ని కలుగ చేశారు.** అట్టి పరమపూజ్య **శ్రీశ్రీశ్రీ జగద్గురు జయేన్ద్ర సరస్వతి స్వాములవారికి ఆశ్రమం శ్రద్ధాంజలి ఘటిస్తూంది.**

కారణ జన్ములు
శ్రీ విద్యా ప్రకాశానంద స్వామీజీ

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

విద్యయా తపసాచైవ పూతాత్మా యతిపుంగవః ।
స్వామీ విద్యా ప్రకాశాఖ్యో గురుర్వి జయతేతరామ్ ॥
వాగ్వైభవం యతేర్యస్య సర్వలోకముదావహమ్ ।
జాడ్యాపహం చ చైతన్యదాయకం తం గురుం భజే ॥

'విద్యాతపోభ్యాం పూతాత్మా' అని వేదవాక్యం విద్యచేతా, తపస్సుచేతా మానవుడు పవిత్రాత్ముడవుతాడు.

పరావిద్య, అపరావిద్య అని విద్య రెండు విధాలు. పరావిద్య అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. అపరావిద్య లౌకికమైన జ్ఞాన విజ్ఞానాలను సమకూరుస్తుంది. 'విద్యయా తపసాచైవ' అనుచోట పరావిద్యనే గ్రహించాలి. విద్యతోపాటు తపస్సు గూడా ఉన్నప్పుడే మనుజుడు బ్రహ్మజ్ఞుడు కాగలుగుతాడు.

అట్టి స్థితిని పొందిన ఆధునిక యతి పుంగవులలో శ్రీ సద్గురు మలయాళస్వాములవారి ప్రముఖ శిష్యులు, శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపకులు, గీతామకరందాది బహు గ్రంథకర్తలూ అయిన పూజ్య శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ఈ లోకంలో అవతరించి 104 సంవత్సరాలు గడిచాయి. వారు కారణజన్ములు.

జాయతే మృతయే లోకో
మ్రియతే జననాయ చ । (యోగవాసిష్ఠం)

మరణించడానికి జన్మించడం, జన్మించడానికి మరణించడం అనే ప్రక్రియ జీవకోటి కంతటికీ సర్వ సాధారణమై వున్నది. కాని కొందరు కారణజన్ములగు మహానుభావులు శరీరపరిత్యాగానికి ముందే అసాధారణమైన ఘనకార్యాలు నిర్వహిస్తారు. అట్టి మహనీయులలో శ్రీ విద్యాప్రకాశనంద స్వామీజీ ఒకరు.

కార్యసాధనకు ఉపకరించే త్రికరణాలో వాక్కు ఒకటి. వేదాలు, వాటిననుసరించిన శాస్త్రాలు, పురాణేతిహాసాలు, కావ్యాలు వగైరా మనకు వాగ్రూపంలోనే లభించాయి. అట్టి వాక్కును లోకోపకారకమయ్యేటట్లు వినియోగించినవారిలో అగ్రగణ్యులు శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు.

వారి ఆధ్యాత్మిక ప్రసంగాలు జ్ఞానయజ్ఞాలై భాసించాయి. అవి సర్వజనులకూ ఆహ్లాదం కలిగించాయి. అందువల్లనే వారు నిర్వహించిన గీతాయజ్ఞాలకు వేలకొలది జనులు హాజరయ్యేవారు.

ద్రవ్యయజ్ఞం కంటే జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమని భగవద్వచనం. శ్రీ స్వాములవారు నిర్వహించిన శతాధిక గీతాయజ్ఞాలు జ్ఞానయజ్ఞాలే. అందులో పాల్గొని శ్రీస్వాములవారి ప్రవచనాలు విన్నవారు జడత్వం వీడి చైతన్యం పొందారు.

శ్రీ స్వాములవారి గురుదేవులు శ్రీమలయాళస్వాములవారు "జడత్వమును బోధింపకుడు, చైతన్యమునే బోధింపుడు" అని ప్రబోధించేవారు. శ్రీకృష్ణుడు అర్జునుని జడత్వాన్ని రూపుమాపడానికే గీతలో ఆత్మవిద్యను బోధించాడు. ఆ గీతనే ఆధారంగా పరిగ్రహించి శ్రీ విద్యాప్రకాశానంద స్వామివారు వేలకొలది జనానీకానికి ఆత్మతత్త్వ ప్రబోధం కావించారు. వారిలోని జడభావాలను తొలగించి చైతన్యాన్ని పాదుకొల్పారు.

శ్రీ స్వాములవారి ప్రవచన ధోరణిని ఒక కవితల్లజుడీవిధంగా వినుతించాడు.

ఓం కారమునకు నత్యున్నత వేదాంత
గోష్ఠికి స్త్రీలును కొన్ని కులము
లందు బుట్టువారనర్హులను ఛాందస
ప్రవరుల వాదనల్ బదబదలుగ
జేయు వ్యాసాశ్రమశ్రీకి శుకబ్రహ్మ
యాశ్రమం బత్యంత మండగాగ
శుష్కవేదాంతులెచ్చోనున్న సత్యమున్
బలికించి మించి సత్ప్రభలనించి
కరము భారతభూమి నల్లడలయందు
దివ్య వేదాంత సారమున్ భవ్యమతుల

కందజేయుచు నైకృత నలరుచుండు
గాత ! వ్యాసాశ్రమమ్ము శుకాశ్రమమ్ము
(స్వామీ జీవిత చరిత్ర - మొదటి ముద్రణ 245 పుట)
గంభీరమైన ముఖ్యాంశంబులను జెప్పి
దీక్షతో భక్తి సందేశమిచ్చు
సర్వ జనాళికి సరళమౌ భాషలో
తత్త్వాలు పాడి బోధనలు సలుపు
విశ్వ విఖ్యాతమౌ విజ్ఞాన మిది యన
ఆంగ్లేయుల ప్రశంసలందజేయు
వినువారలకు సుంత విసుగు రాకుండంగ
తగినట్టి కథల నుదాహరించు
పద్యములు శ్లోకములు కథల్ పాటలెన్నో
గాంగ నిర్ఝరివంటి వాగ్ధాటి తోడ
శ్రోతలెల్లరు ప్రతిమలై చూచి వినగ
ప్రవచనం బిచ్చినారు శ్రీ స్వామివారు (అందే - 246)

ఈ ప్రవచనాల శ్రోతలు తరతరాలనుండి తమలో గూడు కట్టుకొని ఉండిన మూఢవిశ్వాసాలను తొలగించుకో గలిగారు.

గీతోదిత తత్త్వాన్ని లోకానికి బోధించే వాని కంటె ప్రియతరుడు నాకు మరొకడు లేడనీ, అట్టివాడు తుదకు తన్నే చేరుకోగలడనీ గీతలో భగవానుడు చెప్పి యున్నాడు. ఆ ఘనత శ్రీ విద్యాప్రకాశానందస్వాముల వారికి దక్కింది.

శ్రీ స్వామివారి అవతారం ప్రవచనాలకు మాత్రమే పరిమితం కాలేదు. వారు వ్రాసిన గ్రంథాలు అనన్య సామాన్యమైన వ్యాప్తిని పొందాయి. పలు భాషలలో వెలువడి పలుమార్లు ముద్రింపబడిన గీతామకరందం వారి రచనలలో అగ్రగణ్యమై భాసిస్తున్నది. పంచరత్నాకరాలన్న పేరుతో భారత భాగవత రామాయణాలు, ఉపనిషత్తులు, యోగవాసిష్ఠం వీటిని సంగ్రహించి తాత్పర్య సమేతంగా లోకానికి అందించిన తీరు ప్రశంసనీయం.

శ్రీ స్వామివారికి గల గురుభక్తి గూడా గణనీయమైనది. వారి

గురువులు చరాచరసుఖాభిలాషి శ్రీ మలయాళస్వాములవారన్న విషయం అందరికీ విదితమే.

1962లో శయనైకాదశినాడు (12-7-1962) శ్రీమలయాళ సద్గురుదేవులు శరీరపరిత్యాగం చేశారు. వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వీరు చెప్పిన ఈక్రింది మాటలు స్మరణీయాలు.

" ఇరువదియవ శతాబ్దమున, భారతదేశంలో అందును ముఖ్యముగ దక్షిణాపథమున ఆధ్యాత్మిక గగన వీథియందు తమ దివ్యతేజః పుంజములు దశదిశల విరజిమ్ముచు ప్రకాశించిన గొప్ప నక్షత్రములు మూడు కలవు. అవియే శ్రీరమణమహర్షి, శ్రీఅరవింద యోగి, శ్రీమలయాళయతీంద్రులు అను సంజ్ఞలతో నొప్పుచు జగద్విఖ్యాతిగాంచిన మహనీయుల పుణ్యస్వరూపములు. జనుల హృదయాంతరాళములయందు వ్యాపించిన నిబిడ అజ్ఞానతమమును విచ్ఛిన్న మొనర్చుటకు కంకణబద్ధులై యవతరించిన యుగపురుషులు వీరు. కోటానుకోట్ల జనులలో ఇటువంటి ఏ ఒకరిద్దరినో భగవానుడు తన పవిత్ర సందేశమును లోకమున ప్రకటించుటకు ఎన్నికొనును. వారు ఆజీవితమూ ఒక్క కళంకమైనను లేక, నిర్దుష్ట జీవితమును గడపుచు, తాము తరించి యితరులను గూడ, తరింపజేయుదురు. వారు ముప్వరును తమకు నిర్దేశింపబడిన లోకోద్ధరణ కార్యమును మిగుల దక్షతతో పూర్తిచేసుకొని భగవంతుని పిలుపు నాలకించి ఒకరి తరువాత నొకరుగ ఇహలోకమును వీడి పరంధామమును జేరుకొనిరి" (యథార్థ భారతి ఆగస్టు - 1962)

ఇంకను అనేక విధముల శ్రీ సద్గురు దేవుల ఘనతను ప్రశంసించిన శ్రీ విద్యాప్రకాశానందులవారు అంతటితో తృప్తి పడక శ్రీ మహర్షి మలయాళస్వామి అను ఒక గ్రంథాన్ని గూడా రచించి అందులో శ్రీవారి విశిష్టతను ప్రశంసించి తమ గురుభక్తిని వ్యక్తం చేసుకొన్నారు.

1976లో శ్రీ మలయాళ స్వాములవారి జీవితచరిత్రను రచించే సౌభాగ్యానికి నోచుకొన్న ఈ వ్యాస రచయిత 1992లో శ్రీ విద్యాప్రకాశానంద స్వామివారి జీవిత చరిత్రను గూడా రచించే అదృష్టానికి పాత్రమైనాడు. ఇటీవల పూజ్య శ్రీ విద్యాస్వరూపానందగిరి

స్వాములవారి ప్రేరణతో ఆ చరిత్రలో చేర్చదగిన కొన్ని అంశాలను గూడచేర్చి ప్రకటించడమైనది. శ్రీ స్వాములవారి జీవిత విశేషాలను ఆ గ్రంథములో విపులంగా చూడవచ్చు.

గీతా ప్రచారలోలాయ గీతాతత్త్వార్థ వేదినే
గీతాయజ్ఞేశ్వరాయాస్తు గురుదేవాయ మంగళమ్ ॥

సంత్ జ్ఞానేశ్వర్ మహరాజ్ విరచిత

అమృతానుభవము

- అనువాదం : నైనారు అప్పాస్వామి (తిరుపతి)

ఆరిపోవు నపుడు మంట యధికమగును
మొలక పెరిగిన బీజంబు మోడువడును
మల్లె వికసించి మురిపించి మరగిపోవు
చూడ సర్వంబు క్షణికమై వీడిపోవు 1

భ్రాంతి నెల్లను ద్రావిన ప్రజ్ఞగూడ
మెరపువలె దోచి యంతలో మరుగుజెందు
సచ్చిదానంద మనుభవ సారమైన
నిలచు నాత్మయే సర్వంబు నిండియుండి 2

ప్రళయకాలాన సంద్రముల్ ప్రస్తరించి
విశ్వమంతయు నీటిలో విలయమందు
నీరు నేలలున్నవనుట నిజముగాదు
అర్థరహిత మా భావంబు వ్యర్థమగును 3

వ్యాప్తి జెందగ సూర్యుడవారితముగ
వెలుగు ప్రసరించు సర్వంబు చెలువుమీర
చీకటుండదు వెదకిన లోకమందు
వెలుగు చీకట్ల భావంబు నిలువదపుడు 4

నిద్ర మెలకువయను ద్వంద్వ నియతిరాదు
భ్రాంతి దొలగిన జ్ఞానమే భద్రమగును

మూలం **భాగవత కథలు - భక్త ధ్రువుడు**

అనువాదం:

శ్రీరామచంద్రడోంగరే మహరాజ్

(గత సంచిక తరువాయి) శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు

ధ్రువుడు మధువనానికి వచ్చాడు.మొదటిరోజు ఉపవాసమున్నాడు. ఆపైన మూడురోజులు ఒకే ఆసనంపై కూర్చొని ధ్యానం చేశాడు. కేవలం ఫలాహారం చేశాడు. అన్నాహారము వలన రజోగుణావృద్ధి చెందుతూంది. ఫలాహారం వలన సత్త్వగుణం వృద్ధి చెందుతుంది. రెండో నెలలో మరింత సంయమనం పాటించాడు. ఒకేమారు ఆరు రోజులు ధ్యానం చేయసాగాడు. ఫలాహారాన్ని వదలివేసాడు. కేవలం చెట్ల ఆకులను తింటూ వుండినాడు. మెల్లమెల్లగా సంయమం పెరిగే కొద్దీ భక్తి కూడా పెరుగజొచ్చింది. ఏ విషయాన్ని ఒకమారు త్యాగం చేశావో - వదలి పెట్టావో దానిపై మనస్సును, ఇన్ద్రియాలను ఎప్పుడూ లగ్నం చేయవద్దు.

నాల్గవనెల కేవలం యమునానది నీటిని త్రాగి పదకొండురోజులు ఒకే ఆసనంపై కూర్చొని జపం చేశాడు. ఐదవనెలలో నీటిని త్రాగడం కూడ వదలిపెట్టినాడు. వాయుభక్షణ చేసి పదిహేను రోజుల వరకు ఒకే ఆసనంలో జపం చేస్తూండినాడు. ఆరవనెల రాగానే ఎంతవరకు పరమాత్మ లభించడో - కనిపించడో అంతవరకు నేను ఈ ఆసనంపైనే కూర్చొని జపధ్యానాలలో నిమగ్నమవుతానని నిశ్చయించాడు. నిర్ణయం ధృడమైనది అయితే భగవంతుడు తప్పక లభిస్తాడు. వృత్తి బ్రహ్మాకారాన్ని చెందుతుంది. కానీ దాన్ని అలానే వుంచడం చాలా కఠినమైన పని. ధ్రువుడు ఆరు నెలలు వఱకు సతతం పరమాత్మధ్యానం చేశాడు. తన హృదయంలో నారాయణుని స్వరూపాన్ని దర్శించాడు. ఇపుడు నోటితో జపం కాదు (ఉపాంశుకాదు), మనస్సుతో (మానసిక) జపం చేయసాగాడు.

ధ్రువుని తపస్సుచే ప్రభావితులై దేవతా గణం - తమరు శీఘ్రంగా ధ్రువునికి దర్శనమవ్వండని - నారాయణుని ప్రార్థించారు. దేవతల ప్రార్థన వినిన భగవంతుడు దేవతలతో చెప్పాడు - నేను ధ్రువునికి దర్శనం

ఇవ్వడానికి కాదు, అతనిని నేను దర్శించే దానికై పోతున్నాను అని, భగవంతునికి ధ్రువుని చూడాలని కోరిక కలిగింది. 'మధోర్వనం మర్త్యదిదృక్షయా గతః,అని భాగవతంలో వ్రాయబడినది.

ధ్రువుని సమక్షంలో నారాయణుడు ప్రకటమయ్యారు. కానీ ధ్రువుడు కళ్లు తెరువలేదు. ఈ విధంగా నేను ఎంతవఱకు నిలబడి వుండును ? అని భగవంతుడు ఆలోచించాడు. ధ్రువుని హృదయంలో భగవంతుని ఏ తేజోమయ స్వరూపం ప్రకటంగా వుందో దానిని ప్రభువు అంతర్ధానం చేశాడు. ఇపుడు ధ్రువుడు కలత జెందాడు. ఆ దివ్యస్వరూపం ఎచటికి అదృశ్యమైంది. ? అని ఆలోచించసాగాడు. ధ్రువుడు కళ్లు తెరిచాడు. తన ఎదుట చతుర్భుజుడైన నారాయణుని చూచాడు. ఇపుడు ధ్రువుడు దర్శనం చేయడం లేదు. కానీ ఆయన రూప జ్యోతిని తాగుతున్నాడు. చాలా మాట్లాడాలని వుంది. కానీ తాను అజ్ఞాని అయి వుండి ఎలా మాట్లాడాలి?

తన శంఖంతో భగవంతుడు బాలుని చెక్కిలిని స్పృశించాడు. ధ్రువుని మనస్సులో సరస్వతిని జాగృతం చేశాడు.

"యో ఽ న్తః ప్రవిశ్య మమ వాచామిమాం ప్రసుప్తాం
సంజీవయత్యఖిల శక్తిధరః స్వధామ్నా।
అన్యాంశ్చ హస్తచరణ శ్రవణ త్వగాదీన్
ప్రాణాన్నమో భగవతే పురుషాయ తుభ్యమ్ ॥ (భాగ 4-9-6)

ప్రభూ ! తమరు సర్వశక్తి సంపన్నులు. మీరే నా అంతఃకరణంలో ప్రవేశించి మీ తేజస్సుతో ఈ ప్రసుప్త వాణిని చేతనతోగూడినదిగా చేస్తున్నారు. నా చేతులు, పాదాలు, చెవులు, చర్మం మొదలగు అన్ని ఇంద్రియాలకు అట్లే ప్రాణాలకు చైతన్యాన్నిస్తున్నారు. అట్టి అంతర్యామి, భగవంతుడగు మీకు నేను వందనం చేస్తున్నాను. నా బుద్ధిలో ప్రవేశించి దానిని సత్కర్మలు చేయడానికి ప్రేరేపించే ప్రభువుకు నేను మాటిమాటికి వందనం చేస్తున్నాను. కృతజ్ఞుడను మిమ్ములనెట్లు మరువగలను. ఎవడు మిమ్ములను స్తుతించడో వాడు నిజంగా కృతఘ్నుడే, మీరు మానవుని జనన మరణ చక్రంనుండి ముక్తుణ్ణి చేస్తున్నారు. విషయ కామనల కోర్కెతో మిమ్ముల భజించేవాడు మూర్ఖుడు. మీరు కల్పవృక్షమై వున్నారు. ఐనా ఆ మూర్ఖ ప్రజలు దేహోపభోగాలకోసరం ఏ సుఖాల కారణంగానే ప్రాణులు నరకలోనికి పోవలసి వస్తుందో అట్టి సుఖాలను ఇష్టపడుతున్నారు.

మీరు ఎపుడు కృప జూపుతారో అప్పుడే ఈ జీవుడు మిమ్ములను గుర్తించగల్గుతాడు. మీ కృప లభించిన మీదటనే ఈ జీవుడు మీ దర్శనం చేయగలుగుతాడు. మిమ్ములను పొందగలడు. సాధన మాంత్రంతో ఈశ్వర దర్శనం కలుగదు. కృష్ణుడు కృపాసాధ్యుడు. సాధన సాధ్యము కాదు. నీవు సాధన చేయవద్దని దీని అర్థం కాదు. సాధన తప్పకచై, కాని ఆ సాధనపై విశ్వాసముంచకు. అభిమానముంచకు. సాధన చేయదగిందే, సాధన చేస్తూ చేస్తూ అలసిపోయిన జీవుడు దీనుడై ఎపుడు ఏడ్చుతాడో అప్పుడు భగవంతుడు కృపచూపుతాడు. ఉపనిషత్తులలో కూడా చెప్పబడింది. "నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహూనా శ్రుతేన। యమైవైష వృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా వృణుతే తనూస్వామ్ ॥ -ఈ ఆత్మ వేదాభ్యానం వలన లభించదు. బుద్ధిచాతుర్యంతోను లభించదు, అనేక శాస్త్రాలను వినడం చేత లభించదు, కానీ అది ఎవరిని వరించునో అతనికి ఈ ఆత్మ లభిస్తుంది. ఆత్మ అతనికి తన స్వరూప దర్శనాన్ని కలుగజేస్తుంది.

సాధ్య ప్రాప్త్యనంతరం చాలా మంది సాధనను ఉపేక్షిస్తారు. సాధనను ఉపేక్షించినందువలన మరల మాయ ప్రవేశిస్తుంది. అద్వైత భావసిద్ధి తరువాత కూడ వైష్ణవుడు భగవద్భక్తిని చేస్తూనే వుంటాడు. ఈశ్వర ప్రాప్తి కలిగినప్పటికీ సాధనను వదలిపెట్టరాదు. సాధనకు అట్టి అలవాటు కలుగుతుంది, అది వదలను వదలదు.

ప్రభో ! తమ దర్శనం కలిగిన తరువాత కూడ నిజమైన జ్ఞానిభక్తుడు తమపై భక్తిని వదలజాలడు. తమ సాక్షాత్కారానంతరం ఎవడు మిమ్ములను స్మరించడో వాడు కృతఘ్నుడు. అపరోక్షానుభూతి

కలిగిన తరువాత కూడ అతడు భజనను వదలజాలడు.

ధ్రువుడు సుందరమైన భగవంతుని స్తుతి చేశాడు. ప్రభూ! నీ మురిపపు భక్తుడు ఎప్పుడూ నీ దర్శనం చేస్తూ, స్మరణ చేస్తూ నీ కథను చెప్పుతాడో అప్పుడు దాన్ని వినేసుయోగాన్ని నాకు ఇచ్చేందుకు కృపజూపుము. ఆ ఆనందం యోగుల బ్రహ్మానందం కంటే కూడా శ్రేష్ఠము. ధ్రువుడు పండితులు చెప్పే భగవంతుని కథను వినడానికి ఇష్టం చూపలేదు. అతనికి ఎవరి హృదయం కృష్ణభక్తిరసంలో లీనమైందో అతడు చెప్పే కథను వినాలి అనే అతనికి సంకల్పముండినది. జ్ఞాని కథ మఱియు భక్తుని హృదయ కథలో తేడా వుంది. మీ కథ వలన కలిగే ఆనందం బ్రహ్మానందం కంటే గొప్పది. (శ్రేష్ఠము).

ఈ శ్లోకానికి అర్థం వ్రాయడంలో శ్రీ ధరస్వామికి కొంచెం కఠిన మనిపించింది ఇచట ఉపనిషత్సిద్ధాన్తానికి కొంచెం విరోధించినట్లు వ్రాయబడింది. బ్రహ్మానందమే శ్రేష్ఠమని ఉపనిషత్తులలో చెప్పబడింది. ఏ ఆనందం కూడా బ్రహ్మానందం కంటే శ్రేష్ఠం కాజాలదు. తైత్తరీయోపనిషత్తులో ఆనందం వర్ణింపబడియుంది. మనుష్యానందాపేక్ష్యా గంధర్వానందం గొప్పది. దీని అపేక్ష్యా స్వర్గంలోని దేవతల ఆనందం గొప్పది. దేవతల ఆనందం కంటే ఇన్ద్రుని ఆనందం పెద్దది. ఇన్ద్రుని ఆనందాపేక్ష్య బృహస్పతియొక్క ఆనందం నూరురెట్లు పెద్దది. కానీ బ్రహ్మానందం సర్వశ్రేష్ఠ ఆనందము.

ఎవడు నిష్కాముడో (ఏ కోరికలు లేనివాడో) నిర్వికారుడో ఎవరి మనస్సు నిరోధావస్థను పొందినదో అతనికి ఏ ఆనందం లభిస్తుందో అదే బ్రహ్మానందము. ఇది సర్వశ్రేష్ఠానందము. బ్రహ్మాకార వృత్తిగల యోగులకు ఏ బ్రహ్మానందం ప్రాప్తమవుతుందో అది శ్రేష్ఠమైన ఆనందము. ఎచట ద్వైతము, ప్రపంచము, నేను నీవు అనేవి లేవో ఆ ఆనందం శ్రేష్ఠము. ఎంతవఱకు నేను నీవు అనేవానికి ఉనికి వుందో అంతవఱకు శ్రీ కృష్ణానందం చిక్కదు. బ్రహ్మానందం లభించిన తరువాత సాంసారికత, జగత్తుయొక్క ఉనికి వుండజాలదు. **(సశేషము)**



భగవంతుడికి ఇష్టమైనవారు
శ్రీ సద్గురుదేవులు

– కె. ఈశ్వర్

మనకు భగవంతుడంటే ఇష్టమే.

భగవంతుడికి మనమంటే ఇష్టమా ? !

అను విషయాన్ని గురించి మనమంతా ఆలోచించాలి.

భగవంతుడికి ఇష్టమైన పనులు చేసినవారంతా ఆయనకు ఇష్టమైనవారే.

భగవంతుడికి ఇష్టమైన పనులు చేసి భగవంతుని సంపూర్ణ ఆశీస్సులు, దండిగ, నిండుగ, మెండుగ పొందినవారి జాబితాలో చేరినవారే పూజ్యపాదులు గురుదేవులు, శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు, గీతామకరంద గ్రంథ రచయిత శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. శ్రీ స్వాములవారు గీతాచార్యునికి ఎంత సన్నిహితులో ఈ క్రింది గీతాశ్లోకాలు వివరిస్తున్నవి.

శ్లో ॥ య ఇమం పరమం గుహ్యం
మద్భక్తేష్వభిధాస్యతి,
భక్తిం మయి పరాం కృత్వా
మామే వైష్యత్యసంశయః (18అ – 68 శ్లో ॥)

ఎవడు అతి రహస్యమగు ఈ గీతాశాస్త్రమును నా భక్తులకు వివరించునో అట్టివారు నన్నే పొందగలడు.

శ్లో ॥ న చ తస్మాన్మనుష్యేషు
కశ్చిన్మే ప్రియకృత్తమః
భవితా న చ మే తస్మా
దన్యః ప్రియతరో భువి (18 అ – 69 శ్లో ॥)

మనుజులలో అట్టివానికంటే నాకు ప్రియమొనర్చువాడెవడును లేడు మరియు అతనికంటే నాకు మిక్కిలి ఇష్టుడైనవాడు ఈ భూలోకమున మరియొకడు వుండబోడు. భగవద్గీతా ప్రచారమునకై భగవంతుడు పంపించిన మహర్షి శ్రీ స్వాములవారిని గురించి అందరినోట ఇదేమాట.

ఏమి మహిమో – తెలియలేము

ఎంత ఘనతో - చెప్పలేము
ఇంటి పనులు - చక్క పెట్టి
వంటవార్పులు - చేసి చేసి
పరుగు పరుగున - గీత బోధకు
కదలివచ్చిరి - ఎంత వింతో

వంట పనులు, ఇంటి పనులు ఎన్ని వున్నా, కష్టముతోనో, ఇష్టముతోనో పూర్తి చేసుకుని శ్రీ స్వామివారి గీతా ప్రవచనములకు పరుగో పరుగు. వచ్చిన వారు వచ్చినట్లుగ కూర్చొని ఆషామాషిగా వినుట ఎంతమాత్రము కాదు. **ఇల్లు వాకిళ్ళు మరచి గీతాప్రవచనము వినుటలో లీనమైపోయేవారు.** అశాంతితో, బాధలతో జీవితముపై విరక్తి కలిగినవారు సహితము శ్రీవారి బోధలతో, వారి బాధలు తీరినట్లు భావించేవారు. మనశ్శాంతి పొందేవారు.

గీతాయజ్ఞముల పేరుతో భగవద్గీతా ప్రవచనముల ద్వారా ఒక విప్లవాన్ని సృష్టించారు. ఆ విప్లవానికి తిరుమల, తిరుపతి దేవస్థానం ఆనాటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్, ఐ.ఎ.ఎస్ వారు శ్రీవారి ప్రవచనాలకు ఆకర్షితులైరి. అనేకచోట్ల గీతాయజ్ఞములను తిరుపతి దేవస్థానం వారే నిర్వహించిరి.

శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్,(ఇ.ఓ.)గారు తిరుపతి కార్యక్రమమును గురించి వివరిస్తూ గీతా **ప్రవచనములకు తిరుపతి చరిత్రలో ఇంతమంది భక్తులను ఆకర్షించిన వారు లేరని ప్రశంసించిరి.** గీతా **ప్రవచనములను ఆడియో క్యాసెట్లుగా** తయారు చేయించి అందించిన ఘనత కూడాశ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్, (ఇ.ఓ.) గారికే దక్కినది. వీడియో సి.డి.లుగా అందుబాటులోనికి తెచ్చారు.

శ్రీవారి జన్మదిన శుభ సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు మనందరికి వుండాలని ప్రార్థిస్థు ! స్వామీ ! గురుదేవా ! మీ పాదాలను సర్వదా ధ్యానిస్తూ వున్నాను స్వామీ ! మీ వాక్కులు మదిలోనే వున్నాయి స్వామీ ! మరుపురాని మీ మధురానుభూతులను నెమరువేసుకుంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నాను స్వామీ!

గురుదేవా ! పాహిమాం, పాహిమాం, పాహిమాం పాహి.

జై శ్రీరామ - వాసుదేవ

వార్తలు

(01). 26-2-2018వ తేది సోమవారం నుండి 10వ జ్ఞాన సదస్సు ప్రారంభమై 1-3-2018 ఫాల్గుణ పౌర్ణమితో సమాప్తమైంది. పరమపూజ్య యోగిని చంద్రకాళీ ప్రసాదమాతాజీగారు (కాళీవనాశ్రమాధిపతులు, నంబూరు) కైవల్యోపనిషత్తుపై ప్రతిరోజు ఉదయం, సాయంకాలం ప్రవచన చేశారు. విశాఖపట్టణం, చెన్నై, బెంగుళూరు నుంచి కూడ శ్రోతలు వచ్చినారు. ఆనంద ప్రదంగా సదస్సు జరిగినది. శ్రోతలలో స్థానికులు గూడ వున్నారు. విని జన్మధన్యమైనదని సంతోషించారు.

(02). 26-2-2018 తేది ఆశ్రమ త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు సమావేశం జరిగినది. 2018-2019 బడ్జెట్ ఆమోదింపబడినది.

(03). 18-3-2018 తేది విళంబినామ సంవత్సర ఉగాది - సంవత్సరాది సందర్భంగా ఆశ్రమ శివాలయంలో బ్రహ్మశ్రీ యోగానంద గారిచే రుద్రాభిషేకం, బిల్వార్చన హెూమం చేయబడినది. వేదపారాయణ జరిగినది. వేదపండితులకు పూజ్యశ్రీ స్వాములవారు సత్కారం చేశారు.

(04).10-3-2018, 11-3-2018 తేదీలలో తెలంగాణా రాష్ట్రం నిర్మల సమీప వెంకటాపురం గ్రామంలోని శ్రీస్వామి విద్యాప్రకాశానంద బ్రహ్మనిష్ఠాశ్రమంలో పూజ్య శ్రీ స్వాములవారు, ప్రవచనలు చేశారు. 12-3-2018 నుండి 3 రోజులు సారంగపూర్ మండలం బీరవెల్లి గ్రామంలోని శ్రీ విద్యాప్రకాశానందస్వామి గీతాశ్రమ వార్షికోత్సవం జరిగినది. అందు పూజ్య శ్రీ స్వాములవారు ప్రవచన చేశారు. 15-3-2018, 16-3-2018 తేదీలలో దిల్వార్‌పూర్ మండలం జి.నర్సాపూర్‌లోని శ్రీ విద్యాప్రకావానంద గీతా సమాజ వార్షికోత్సవంలో శ్రీస్వాములవారు ప్రవచన చేశారు. ఈమూడు కార్యక్రమాలలో పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు (శ్రీ శుకబ్రహ్మాశ్రమ ఉత్తర పీఠాధిపతులు) పాల్గొని ఉపన్యసించారు.

(5). ఆశ్రమ కంటిఆసుపత్రిలో ఫిబ్రవరి నెలలో ఓ.పి.లో **765** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేశారు. **63** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చారు. **ఐదుగురికి** యాగ్ లేజర్ చికిత్స చేశారు.